నిజం మా నైజం..!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 346 | బుధవారం, 13 మే 2026 | పేజీలు - 8 | వెల : 3/-




## నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

### పంట కొనుగోళ్లపై కలెక్టర్లకు రేవంత్ వార్నింగ్

సేకరణ కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడండి

గన్నీ బ్యాగులు, హమాలీల కొరతపై దృష్టి పెట్టండి

కొన్న వెంటనే ధాన్యాన్ని గిడ్డంగులకు తరలించాలి

లారీలు అందుబాటులో లేకుంటే ట్రాక్టర్లు వినియోగించాలని సూచన

3





## క్షేత్రస్థాయి నుంచి.. పార్టీ బలోపేతం

### పని చేసే వారికే పదవులు

ప్రతి కమిటీలోనూ మహిళలకు ప్రాధాన్యం

గ్రామ స్థాయి నుంచి ఉన్నత స్థాయి కమిటీల్లో యువతకు..

రేవంత్ రెడ్డి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ కీలక నేతల సమావేశంలో కేసీఆర్ దిశా నిర్దేశం

3

బీఆర్ఎస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేద్దామని గులాబీ బాస్ కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు.. కొత్త కమిటీలలో యువత, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

## చైనాకు ఇరాన్ చమురు..అమెరికా కొత్త ఆంక్షలు



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** చైనాకు ఇరాన్ చమురును రవాణా చేసిన సంస్థలపై అమెరికా కొత్త ఆంక్షలు విధించింది. ఇరాన్ చమురు రవాణాకు సహాయం చేసిన ముగ్గురు వ్యక్తులు, తొమ్మిది సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించినట్లు ట్రెజరీ పేర్కొంది. వీటిలో నాలుగు హాంకాంగ్ కు, నాలుగు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు చెందినవి కాగా, తొమ్మిదవ కంపెనీ ఒమన్ కు చెందినది. వివిధ బినామీ కంపెనీలను వినియోగించి, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్ జిసి) కు కేటాయించిన ఇరాన్ చమురును చైనాకు విక్రయించేందుకు, రవాణా చేయడానికి సాయమందించిన వ్యక్తులు, సంస్థలు లక్ష్యంగా ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) ఈ కొత్త ఆంక్షలను విధించిందని ట్రెజరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇరాన్ ప్రభుత్వానికి, సైన్యానికి ఆయుధాలు, అణు కార్యక్రమం లేదా ఈ ప్రాంతంలోని బినామీలకు నిధులు అందకుండా చేయడానికి ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలను కొనసాగిస్తుందని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలు చేపట్టడానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి ఇరాన్ వినియోగించే ఆర్థిక నెట్ వర్క్ లకు మద్దతు అందకుండా చేయడాన్ని కొనసాగిస్తుందని బెసెంట్ తెలిపారు.హాంగ్ కాంగ్ కి చెందిన హాంగ్ కాంగ్ బ్లూ ఓషన్ లిమిటెడ్, హాంగ్ కాంగ్ సామ్మ లిమిటెడ్, జియాండి HK లిమిటెడ్, మాక్స్ హానర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ కో లిమిటెడ్, దుబాయ్ కి చెందిన ఓషన్ అలియాంజ్ షిప్పింగ్ ఖాజ, షార్జాకి చెందిన అటిక్ ఎనర్జీ ఫ్జీజు, దుబాయ్ కి చెందిన బ్లాంకా గూడ్స్ హోల్‌సేలర్ LLC, యూనివర్సల్ ఫార్చ్యూన్ ట్రేడింగ్ LLC, ఒమన్ కి చెందిన జీయస్ లాజిస్టిక్స్ గ్రూప్ లపై కొత్తగా ఆంక్షలు విధించనుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో సమావేశానికి కొన్ని రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## సీఎం విజయ్ సంచలన నిర్ణయం




**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ తన తొలి ప్రధాన పరిపాలనా నిర్ణయంతో సంచలనం సృష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లకు సమీపంలో ఉన్న 717 ప్రభుత్వ మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. రెండు వారాల్లోగా ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం తమిళనాడులో మొత్తం 4,765 టాస్మాక్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో మూసివేయనున్న 717 షాపుల్లో.. 276 ప్రార్థనా స్థలాల దగ్గర, 186 విద్యాసంస్థల దగ్గర, 255 బస్టాండ్ల దగ్గర ఉన్నట్టు గుర్తించారు. సున్నితమైన ప్రాంతాల్లో మద్యం లభ్యతపై వస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ సామాజిక సంస్కరణ చర్య చేపట్టినట్లు కొత్త ప్రభుత్వం పేర్కొంది.

## టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు




**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ నేపథ్యంలో నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన (టీ ఆర్ ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. రేపు విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

## హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో, ఆయన వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టనుంది.



## అంజన్న ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

### కొండగట్టులో దీక్షా విరమణ భక్తులతో కిటకిట

### నేడు హనుమాన్ జయంతి

4

తెలంగాణలోని అంజన్న ఆలయాలల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరిగాయి.. దీక్షా విరమణ భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు కన్నులపండువగా జరిగాయి.

# కొనుగోళ్ల పై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటాం..... సీఎం రేవంత్ రెడ్డి

- అవసరమైతే అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి
- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి
- స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి
- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి
- ధాన్యం కొనుగోళ్లపై వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించాలి
- జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్







**వాస్తవతెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు.

మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దానసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మెదక్ ఐడీఓసీ నుండి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సాధారణ విధానాన్ని విడిచి మిషన్ మోడ్‌లో పని చేయాలని, కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. రిజాయిండర్లు క్రమం తప్పకుండా మీడియాకు పంపించాలని సూచించారు. తప్పుడు వార్తలను ఎదుర్కోవడంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు.పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ. 4,178 కోట్లను ఆమోదించిందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 14 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా ఇప్పటికే 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు.హమాలీలు, గన్నీ సంచులు, నిల్వ సామర్థ్యం అంశాలపై కలెక్టర్లతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ. 8.50కు పెంచినట్లు చెప్పారు. అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఐజి కాలనీ, చర్లపల్లి వాసుల పరిష్కారానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి పలువురికి సమస్యలపై వినతి పత్రం.. పాల్గొన్నా మహేష్ గౌడ్...







**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్**/మేడ్చల్ జిల్లా కాప్ర మండలం ఐజీ కాలనీ, చెర్లపల్లి వాసుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి , వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముందు అడుగు వేస్తున్నారు.2009 సంవత్సరంలో జేఎన్ఎన్యూఆర్ఎం (జీచీచీఖ=వీ) పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని తెలిపారు.అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు.ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో బి అర్ ఎస్ పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్ , వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు , లోక్ నాథ్ ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న పనుల ను నాణ్యత తో త్వరగా పూర్తి చేయాలని ఎంఎంసి కి ముప్పు రామారావు వినతి..





**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్**/ మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్ప రామారావు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్), ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ లక్ష్మణ్, డీఈఈ మాధవ చారి, ఏఈ మధురిమ మరియు వారి బృందం తో కలిసి పెండింగ్‌లో ఉన్న మురుగునీటి లైన్ అప్‌గ్రేడేషన్ పనులను తనిఖీ చేయడానికి సిద్ధార్థ నగర్ కాలనీని సందర్శించారు. వీలైనంత త్వరగా పనిని పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత కాంట్రాక్టర్ ను ముప్పు రామారావు కోరారు. అదే విధంగా పనుల అమలు సమయంలో ప్రజలు తమ మద్దతు, సహకారం అందించాలని కూడా అభ్యర్థించారు.



# నిర్లక్ష్యాన్ని.. ఉపేక్షించం

## పంట కొనుగోళ్లపై కలెక్టర్లకు రేవంత్ వార్నింగ్

సేకరణ కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడండి

గన్నీ బ్యాగులు, హమాలీల కొరతపై దృష్టి పెట్టండి

కొన్న వెంటనే ధాన్యాన్ని గిడ్డంగులకు తరలించాలి

లారీలు అందుబాటులో లేకుంటే ట్రాక్టర్లు వినియోగించాలని సూచన

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలన్నారు.

వాస్తవ తెలంగాణ

### లోడ్ తరలింపునకు అందుబాటులో వాహనాలు

లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు.

### గిడ్డంగుల సమస్య ఉంటే..

గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళి కలుండాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### స్థానిక హమాలీ సేవలు వినియోగించుకోండి

ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షా ల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షా ల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

### రైతులను అప్రమత్తం చేయాలి

వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.



# క్షేత్రస్థాయి నుంచి.. పార్టీ బలోపేతం

## పని చేసే వారికే పదవులు

ప్రతి కమిటీలోనూ మహిళలకు ప్రాధాన్యం

గ్రామ స్థాయి నుంచి ఉన్నత స్థాయి కమిటీల్లో యువతకు ..

రేవంత్ రెడ్డి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ కీలక నేతల సమావేశంలో కేసీఆర్ దిశా నిర్దేశం

బీఆర్ఎస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేద్దామని గులాబీ బాస్ కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు.. కొత్త కమిటీలలో యువత, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఎర్రవెల్లి నివాసంలోబీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు.. ప్రస్తుతం ఈ సమావేశం కొనసాగుతున్నది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా,పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి ,శాసన సభా పక్షాల ఉప నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, టి. హరీశ్ రావు, పి. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఎస్. మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ,పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కల్లపల్లి రవీందర్రావు ఎమ్మెల్సీ,డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే, డా. బండా ప్రకాష్ ముదిరాజ్ ఎమ్మెల్సీ, శ్రీ వి. గంగాధర్ గౌడ్ మాజీ ఎమ్మెల్సీ, జోగినపల్లి సంతోష్ కుమార్ మాజీ ఎంపీ, నారదాసు లక్ష్మణరావు మాజీ ఎమ్మెల్సీ, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రిటైర్డ్ ఐపీఎస్, టి. జీవన్ రెడ్డి మాజీ మంత్రి, సోమ భరత్ కుమార్ గుప్తా మాజీ చైర్మన్, సత్యవతి రాథోడ్ మాజీ ఎమ్మెల్సీ, రావుల చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎంపీ,.లు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా.. కేఆర్ సురేష్ రెడ్డి మాజీ ఎంపీ, మహమ్మద్ అలీ , శ్రీనివాస్ రెడ్డి కూడా హాజరయ్యారు

వాస్తవ తెలంగాణ

### సభ్యత్వ నమోదు, ఇన్‌చార్జీల నియామకంపై ఫోకస్

పార్టీ వర్గాల ప్రకారం, సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ప్రధాన చర్చ కొనసాగుతున్నది. డిజిటల్ మెంబర్‌షిప్‌తో పాటు ఆఫ్‌లైన్ నమోదు కూడా చేపట్టాలనే నిర్ణయం తీసుకున్నారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక ఇన్‌చార్జీలను నియమించి, నెలవారీ రిపోర్టులు తీసుకోవాలని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. పార్టీకి కట్టుబడి ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం.

### రేవంత్ పాలనపై ప్రజలు విసుగు

ఈ సందర్భంగా కేసీఆర్ ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై నేతలతో కలసి సమీక్ష చేశారు.. రెండున్నర ఏళ్లకే రేవంత్ పాలనపై ప్రజలు విసుగుచెందారని నేతలు వివరించారు.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు.ఇది ఇలా ఉంటే లోక్‌సభ ఎన్నికల తర్వాత కొంతకాలంగా బీఆర్ఎస్‌లో యాక్టివిటీ తగ్గింది. ఐతే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి.. రెండున్నరేళ్లు అయిపోవడం, మరోవైపు బీజేపీలో యాక్టివిటీ పెరగడంతో మళ్లీ పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేసే దిశగా బీఆర్ఎస్ సమావేశం నిర్వహిస్తున్నారు..
పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, జిల్లానియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జీల నియామకం, కేడర్ యాక్టివేషన్, ప్రజా ఉద్యమాలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరగనుంది. ఇక ఇటీవల జగిత్యాలలో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్షేత్ర స్థాయి వరకూ పార్టీలోని అన్ని కమిటీలనూ రద్దు చేశారు. ఒక్క పై స్థాయిలో కమిటీని మాత్రమే ఉంచారు. కొత్త కమిటీల ఏర్పాటుపై ఇవాళ చర్చించనున్నారు. పార్టీని కేవలం ఎన్నికలకు పరిమితం చేయకుండా, ప్రజా సమస్యలపై పోరాట పార్టీగా మలచాలని కేసీఆర్ ఆలోచనగాఉందని, అలాగైతేనే పార్టీ పట్ల గ్రామ స్థాయి వరకూ ప్రజల్లో పాజిటివ్ ఫీల్ కలుగుతుందని గులాబీ బాస్ భావిస్తున్నారు..



# భక్తి శ్రద్ధలతో.. హనుమాన్ జయంతి





- అంజన్న ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- కొండగట్టులో దీక్షా విరమణ భక్తులతో కిటకిట

**వాస్తవ తెలంగాణ** తెలంగాణలోని అంజన్న ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.. దీక్షా విరమణ భక్తులతో పలు అలయాలు కిటకిటలా డతున్నాయి.. అంజనేయ స్వామి వారి దర్శనానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.. కాగా, ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. పెద్ద జయంతి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున అభిషేకం అనంతరం లక్ష పూలతో పాటు ఫలాలతో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. హనుమాన్ దీక్షా స్వాములు స్వామివారి సన్నిధిలో మాల విరమణ చేసి ఇరుముడులను సమర్పించారు. కాగా, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్లు కలిసి భక్తుల రద్దీని గమనించడంతోపాటు దీక్ష విరమణ తో పాటు స్వామివారి దర్శనం అయ్యేలా సిబ్బందికి పలు సూచనలు చేస్తూ భక్తుల క్యూ లైన్‌లను క్రమబద్ధీకరించారు.

### హనుమాన్ జయంతి విశిష్టత

కాగా,తెలంగాణలోని పలు అంజనేయస్వామివారి ఆలయాలో మంగళవారం నాడు భక్తి శ్రద్ధలతో హనుమాన్జయంతి వేడుకలు .ఘనంగా నిర్వహిస్తున్నారు. జ్యేష్ఠ మాసం కృష్ణ పక్ష దశమి తిథి నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతిని ఆచరిస్తారు. జ్యేష్ఠ మాసం కృష్ణ పక్ష దశమి తిథి మే 11న మధ్యాహ్నం 3:24 నిమిషాలకు మొదలైంది. మంగళవారం మధ్యాహ్నం 2:52 నిమిషాలకు సమాప్తమవుతుంది. ఈ శుభ సమయంలో చేసే పూజలు విశేష ఫలితాలను ఇస్తాయని నమ్ముతారు. హనుమాన్ జయంతి ప్రత్యేకమైన అంశాలలో ఒకటి.. 41 రోజుల దీక్ష. 41 రోజుల పాటు భక్తులు ఈ కఠిన వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ దీక్షా స్వీకరణ ఏప్రిల్ 2న మొదలైంది. నేటితో ముగియనుంది.

### దీక్షాకాలంలో కఠిన నియమాలు

దీక్షాకాలంలో భక్తులు కఠినమైన నియమాలను ఆచరిస్తారు. ఆ సంజీవరాయుడికి పూజాదికాలను నిర్వహిస్తారు. చివరి రోజున ప్రత్యేక పూజలతో దీక్షను విరమిస్తారు. రామాయణం ప్రకారం వీరాంజనేయుడు అంజనాద్రి కొండపై జన్మించాడని ప్రగాఢంగా నమ్ముతారు. వానర రాజు కేసరి సతిమణి మాత అంజన, ఇక్కడ తీవ్ర తపస్సు చేయగా మారుతి జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. దక్షిణాదిలో, హనుమంతుడిని భక్తి, అపారమైన బలం, ధైర్యం, ఆత్మనియంత్రణ, నిస్వార్థ సేవకు ప్రతీకగా పూజిస్తారు. ఆయన ఆదర్శ ప్రాయమైన విలువలను భక్తులు స్ఫూర్తిగా తీసుకుంటారు. ఆంజనేయుడు వివిధ ప్రాంతాలలో అనేక పేర్లతో పిలువబడతారు. అంజనాద్రిలో మారుతి అని, కన్నడ భాష మాట్లాడే ప్రాంతాలలో హనుమంత, ఆంజనేయ అని సంబోధిస్తారు. తెలుగు ప్రాంతాలలో హనుమంతుడు, ఆంజనేయుడుగా పూజలందుకుంటాడు. పండుగ రోజు తెల్లవారుజామున స్నానం ఆచరించిన తర్వాత, ఉపవాసం, నిష్ఠతో పూజ చేయడానికి సంకల్పం తీసుకుంటారు. భక్తులు హనుమాన్ చాలీసా, సుందరకాండలను పఠిస్తూ స్వామివారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు. సింధూరం, తమల పాకులు, బెల్లం కలిపిన వేయించిన శెనగలు వంటి శుభకరమైన నైవేద్యాలను ఆంజనేయుడికి సమర్పిస్తారు. హనుమాన్ జయంతి రోజున దేవాలయాలు భజనలు, కీర్తనలు, వైభవంగా సాగే ఊరేగింపులతో కళకళలాడుతున్నాయి.

## గంగపుత్ర కార్పొరేషన్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌లను వెంటనే ప్రకటించి నిధులు విడుదల చేయాలి

**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ /.** గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర డిమాండ్ గంగపుత్ర కార్పొరేషన్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌లను వెంటనే నియమించి తగిన నిధులు విడుదల చేయాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర కార్యాలయం నుండి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ కులాలు, వృత్తుల కార్పొరేషన్‌లకు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌ల నియామకాలకు సంబంధించిన జీవోలు విడుదల చేసినప్పటికీ, గంగపుత్ర కార్పొరేషన్‌ను విస్మరించడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గంగపుత్ర చొరవ తీసుకొని గంగపుత్ర కార్పొరేషన్‌కు వెంటనే చైర్మన్, వైస్ చైర్మన్‌లను నియమించి నిధులు మంజూరు చేయాలని కోరారు.గంగపుత్ర కార్పొరేషన్ అనేది కులానికి సంబంధించిన ప్రత్యేక కార్పొరేషన్ కావడంతో రాజకీయాలకు అతీతంగా సమాజ సేవలో ఉన్న వ్యక్తులను చైర్మన్‌లుగా నియమిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అదేవిధంగా ఇటీవల విడుదల చేసిన కుల గణన సర్వేలో తెలంగాణకు చెందిన గంగపుత్ర (బెస్త, గూండ్ల) కులం పేరుకు బదులుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన "అగ్నికుల క్షత్రియ" పేరును చేర్చడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు సంబంధించిన వృత్తి చిహ్నం స్థానంలో క్షత్రియ చిహ్నాన్ని ఇవ్వడం, గంగపుత్రుల సంప్రదాయ వృత్తిని నిర్వహించే వర్గాల గుర్తింపును తగ్గించే విధంగా చర్యలు జరుగుతున్నాయా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్ర సమాజానికి న్యాయం చేసి, వారి గుర్తింపు, హక్కులు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర విజ్ఞప్తి చేశారు.



## అంగరంగ వైభవంగా కాళీ దుర్గామాత ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలు

. వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ /.భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

. ప్రత్యేక పూజలు, దుర్గాహోమం, అన్నప్రసాద కార్యక్రమాలు



**సికింద్రాబాద్,వాస్తవ తెలంగాణా** అన్నా నగర్, బాలంరాయి చౌరస్తాలోని ఎంఈఎస్ క్వార్టర్స్ సాపర్స్ లైన్‌లో ఉన్న శ్రీ కాళీ దుర్గాదేవి ఆలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి అభిషేకం, గణపతి పూజ, కుమ్కుమార్చన, దుర్గాహోమం, మహా హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదం పంపిణీ చేసి, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హనుమాన్ దీవెనలతో మేడ్చల్ ప్రజలకు సుఖశాంతులు కలగాలి.. ఏనుగు సుదర్శన్ రెడ్డి







**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్‌లో హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఆభరణమాల సమర్పణ, హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమాలను శ్రీ కార్యసిద్ధి గణపతి దేవాలయం నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొంపల్లి మోహన్ రెడ్డి,ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారు పవన్ రెడ్డి పాల్గొన్నారు.పర్వతాపూర్ గోశాల వద్ద బైక్ ర్యాలీని ఏనుగు సుదర్శన్ రెడ్డి పవన్ రెడ్డి తో కలిసి జెండా ఊపి ప్రారంభించి,యువతతో కలిసి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారికి ఆభరణాలు సమర్పించి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. "మేడ్చల్ నియోజకవర్గ ప్రజలపై ఆ బజరంగబలి కృప ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా స్వామివారిని ప్రార్థించాము" అని తెలిపారు.హనుమాన్ జన్మోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, యువత ఉత్సాహంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రామ్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి స్వరూప్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, ఉజ్వల్, మల్లారెడ్డి, డివిజన్ కార్యదర్శి స్వప్న, గీతా రామ్, రామ్ చందర్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్భాటాల కన్నా ఆరోగ్యం మిన్న..ఫంక్షన్ హాల్లా పై కఠిన చర్యలు..యజమానులతో కుషాయిగూడ పోలీస్ సమావేశం..

-- నిరంతరం సి సి కెమరా లా నిఘా, సౌండ్, క్రకర్స్ పై ఆంక్షలు...





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం సోమవారం కుషాయిగూడ పరిధిలోని వివిధ ఫంక్షన్ హాల్ యజమానులతో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి కుషాయిగూడ ఎస్ హెచ్ ఓ ఎల్.భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్యంగా ఫంక్షన్ హాల్స్‌లో అధిక శబ్దంతో డీజే సాంగ్స్ నిర్వహించడం, క్రాకర్స్ పేల్చడం వల్ల ఏర్పడుతున్న సౌండ్ పొల్యూషన్ పై చర్చించారు. ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు మరియు రోగులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే ఫంక్షన్ హాల్స్‌కు వచ్చే వాహనాలను రోడ్లపై అడ్డంగా పార్కింగ్ చేయకుండా తగిన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫంక్షన్ హాల్‌లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసే విధంగా నిర్వహించాలని తెలిపారు.రాత్రి సమయాల్లో అధిక శబ్దంతో డీజేలు నిర్వహించకుండా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్ యజమానులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సైలు సుధాకర్ రెడ్డి,మరియు వెంకన్నా , విజయ్ పాల్గొన్నారు.

# పాశ్చత్య సంస్కృతిని విడనాడి హైందవ సంస్కృతిని పాటించాలని పిలుపు





**రాయికోడ్ వాస్తవ తెలంగాణ న్యూస్ //** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోహిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి వారిలో చైతన్యం నింపాలనే ఉద్దేశ్యంతో సోమవారం సాయంత్రం ఘనంగా హిందూ సమ్మేళనంను నిర్వహించడం జరిగింది. ముందుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి చెన్న మల్లిఖార్జున స్వామి,ముఖ్య వక్తలుగా విచ్చేసిన పట్లోళ్ల సంగీత లక్ష్మి (లెక్చరర్),పట్లోళ్ల మురళీధర్ రెడ్డి(ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ మరియు తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్) భారతమాత చిత్రపటానికి పూజాకార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా వక్త పట్లోళ్ల సంగీత లక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరు మన హిందు ధర్మాన్ని పాటిస్తూ తమ బాధ్యతగా పంచ పరివర్తన్(5 పనులను) చేయాలని వాటి గురించి వివరిస్తూ మొదటగా సమాజంలోని హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన ధర్మ సంరక్షణ కోసం పాటుపడేవిధంగా చైతన్యం నింపాలని, రెండు స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని, మూడు కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా అందరూ ఉమ్మడి కుటుంబంగా వుండాలని, నాలుగవ పని పౌర హక్కులను అనగా రూల్స్ ను తూచా తప్పకుండా పాటించాలని, ఐదవ పని పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అలాగే పురుగు మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం చేస్తూ భూమిని కాపాడాలని, ప్రకృతిని కాపాడేందుకు చెట్లను పెంచి వాటి పెరుగుదలకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**వక్త పట్లోళ్ల మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ** హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన సనాతన ధర్మాన్ని పాటిచాలనే ఉద్యేశంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను 1925 విజయదశమి పర్వదినాన డాక్టర్ కేశవరావు బలిరామ్ పంత్ హెడ్గేవార్ మహారాష్ట్రలోని నాగపూర్ లో కొద్దిమందితో స్థాపించి నేడు లక్షల మంది స్వయంసేవకులు హిందూ ధర్మం కోసం పాటుపడుతూ, వరదలు వచ్చిన చోట మరియు ఆపద సమయాన స్వచ్ఛందంగా వివిధ రకాల సేవ కార్యక్రమాలు చేస్తున్న సంస్థ ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. అలాగే దశాబ్దాల చరిత్ర కలిగిన మన సనాతన హైదవసంస్కృతిలో భాగంగా గతంలో అందరూ హిందూ ధర్మాన్ని పాటిస్తూ కట్టుబొట్టు,నడవడిక,ఇతరులపై గౌరవ మర్యాదలు కలిగి ఉండేవారని కానీ నేడు విదేశీ సంస్కృతిని పాటిస్తూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడం, సభ్యసమాజం తలదించుకునేలా వస్త్రధారణ, తల్లిదండ్రులు, గురువులను, పెద్దలను గౌరవం ఇవ్వకుండా ప్రవర్తించడం సిగ్గు చేటు అని తెలుపుతూ ఇప్పటికైనా పాశ్చత్య సంస్కృతిని విడనాడాలని సూచించారు.ముఖ్య అతిథి చెన్న మల్లిఖార్జున స్వామి మాట్లాడుతూ మన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేస్తూ మన దేశాన్ని, ధర్మాన్ని కాపాడాల్సి వచ్చినప్పుడు ముందు ఉండాలి అని అలాగే అందరూ భగవంతుని నామస్మరణతో భక్తి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

# చట్టం ముందు అందరూ సమానమైతే, పోక్సో వంటి తీవ్రమైన కేసులో ఆలస్యం ఎందుకు జరుగుతోంది

## సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** పోక్సో కేసులో బిజెపి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై 17 సంవత్సరాల అమ్మాయి పై లైంగిక వేధింపుల కేసులో కేసు నమోదు అయిన మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం పట్ల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సిటిజన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రాజులుగా బాధిత కుటుంబం న్యాయం కోసం తిరుగుతున్నా పోలీసులు కేసును పట్టించుకోలేదని ఆరోపించారు. బాధితురాలి కుటుంబాన్ని రాజకీయ ప్రభావంతో బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చట్టం ముందు అందరూ సమానమైతే, పోక్సో వంటి తీవ్రమైన కేసులో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పిల్లల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రభుత్వం రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్, మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి, చెందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, ఉషా విజయ్ కుమార్, బానూరి కృష్ణ, మాజి కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, వడ్డే మహేష్, మాజీ సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులుశ్రీకాంత్ రెడ్డి, బుల్కాపూర్ మాజీ వార్డ్ సభ్యులు మల్లారెడ్డి, జులకంటి మహేందర్ రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ



అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం, కొత్తగా నమోదు చేసుకున్న రైతుల వివరాలు, నీటి వనరుల లభ్యత, డ్రిప్ సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఆయిల్ ఫామ్ పంటపై రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. సాగు ప్రారంభించిన రైతులకు సకాలంలో సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తే ఆర్థికంగా మరింత లాభపడతారని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన జీవన విధానము యోగా ద్వారానే సాధ్యం

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ప్రజా పాలన బిప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాల రెండవ రోజు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ మరియు ఇతర విభాగాల ఆధ్వర్యంలో యోగ, ప్రాణాయామము మరియు ఆంగ్లము, అర్థశాస్త్రము, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పీజీ ఎంట్రన్స్ కోచింగ్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపినారు.రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమములో భాగంగా విద్యా దినోత్సవ వారోత్సవాల







కార్యక్రమంలో రెండవ రోజు యోగ, ప్రాణయామము, ఆసనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందము, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారని తెలిపినారు. భారతదేశానికి యోగ, ప్రాణాయామములు ప్రపంచవ్యాప్తంగా ఉన్నతమైన స్థానం ఉందని, యోగా ద్వారా శారీరిక ఆరోగ్యముతో పాటు మానసిక ఆరోగ్యము సాధ్యమవుతుందని తెలిపినారు. అదేవిధంగా ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తానికి గాను ఉన్నత విద్య కమిషనరేట్ ఆదేశానుసారంగా ఆన్లైన్ ద్వారా ఆంగ్లములో పీజీ ఎంట్రన్స్ కి కోచింగ్ ప్రారంభించడం జరిగిందని తెలిపినారు. అదే విధంగా అర్థశాస్త్ర మరియు రాజనీతి శాస్త్ర విభాగాలు తమ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ కి సన్నిధితులు చేయుటకు గాను పీజీ ఎంట్రన్స్ కోచింగ్ను ప్రారంభించడం జరిగిందని తెలిపినారు. ఈ ఎంట్రన్స్ కోచింగ్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పీజీ ఎంట్రన్స్ లో మంచి ర్యాంకులతో కళాశాలకు గుర్తింపు తీసుకుని రావాలని ప్రిన్సిపల్ తెలిపినారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ అశ్విని, ఎన్ఎస్ఎస్ అధికారులు, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ అనురాధ, రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జ్యోష్ణ వివిధ శాఖలధిపతులు కళాశాల అధ్యాపక బృందము, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తాడ్ బంద్ హనుమాన్ దేవాలయం దర్శించుకున్న దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ



**వా స్తవ తెలంగాణా డైలీ న్యూస్ /** .సికింద్రాబాద్ కంటోన్మెంట్ హనుమాన్ జయంతి పురస్కరించుకొని తాడ్బండ్ హనుమాన్ దేవాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి నరేందర్ వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారి సన్నిధిలో మంత్రి కొండా సురేఖ స్వామివారికి వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జన్మదిన సందర్భంగా జయంతి శుభాకాంక్షలు తెలిపారు.తాడ్బండ్ దేవాలయం అతి పురాతనమైన ప్రాచీనమైన దేవాలయాలలో ఒకటని ఈ దేవాలయ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. తాడిపండు దేవాలయంలో అభివృద్ధి పనుల కోసం దాతలు ముందుకు వస్తే తమ శాఖ తరపున అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో విశేషమైన పూజలు వాహన పూజలకు ప్రసిద్ధిగాంచిన చెప్పారు. శనిపీడలతో ఇబ్బందులు ఎదుర్కొనే భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తే స్వామివారి అనుగ్రహంతో భక్తుల బాధలు తొలగి సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు.

# శివంపేట బీర్ పరిశ్రమ లో డిమాండ్ డే

## హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి మే 12** చౌటకూర్ మండలం శివంపేట్ గ్రామ శివారులో గల ఏబిఎన్ మీరు పరిశ్రమ లో మంగళవారం డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో భాగంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ముఖ్యఅతిథిగా హాజరై పరిశ్రమ ప్రధాన ద్వారం ఎదుట కార్మికులతో కలసి నిరసన తెలిపారు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను






వెంటనే రద్దు చేయాలని చుక్కా రాములు డిమాండ్ చేశారు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలు కు కొమ్ము కాస్తుందని ఆరోపించారు కార్మికులు సంఘటితంగా ఉద్యమించి కేంద్ర ప్రభుత్వం మెడలు వచ్చేదాకా పోరాడాలని పిలుపునిచ్చారు అఖిలభారత సిఐటియు పిలుపుమేరకు నోయిడా కార్మికులుకు సంఘీభావం ప్రకటిస్తూ వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు కార్మికుల ఉద్యమాలను అనుగదొక్కడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం ఉపాధ్యక్షుడు వర్కింగ్ ప్రెసిడెంట్ బాగా రెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రసన్న రావు కాంటాక్ట్ యూనియన్ నాయకులు కోడూరు సురేష్ విష్ణువర్ధన్ గౌడ్ మల్లారెడ్డి చంద్రయ్య విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా డిసి శ్రీహరి ఆధ్వర్యంలో వర్మీ హోం కంపోస్ట్ తయారీ పై అవగాహన కార్యక్రమం..

## --- పాల్గొన్నా శానిటేషన్ సూపర్ వైజర్ సుదర్శన్..





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాలనీ రెసిడెన్షియల్ పేరు అసోసియేషన్ వారికి హోం కంపోస్ట్ విషయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అరుణ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు( కెసిసిసి) KCCC కాలనీల సమాఖ్య ప్రెసిడెంట్ సంజీవరెడ్డి సాలరీ సానిటరీ సూపర్వైజర్, జవాన్ రామకృష్ణ ఎస్ ఎఫ్ ఏ మంజుల మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ మన ఇళ్లలో వెలువడే కిచెన్ వేస్ట్ మరియు గార్డెన్ వేస్ట్ తో ఎలా సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చునో ఆ విధానాన్ని సభ్యులందరికీ తెలియజేశారు. చెత్తను మిక్స్ చేసి ఆటో వారికి అందించకుండా, తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను ఎరువు తయారు చేసుకునే విధానం ద్వారా మన మొక్కలకు ఎరువు ప్రత్యేకంగా డబ్బులు ఖర్చు చేయకుండానే తయారు చేసుకోవచ్చని తద్వారా మున్సిపాలిటీకి అట్టి చెత్త రవాణా ఖర్చు ఆదాయి ప్రభుత్వానికి సమాజానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. కావున ప్రతి ఒక్కరూ ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించి ఎరువులు తయారు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి







**మేడ్చల్ జిల్లా వాస్తవ తెలంగాణ** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హనుమాన్ జయంతి సందర్భంగా హెచ్ బి కాలనీ మంగాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం రామంతపూర్ శ్రీనగర్ కాలనీ శ్రీ భక్తాంజనేయ దేవాలయం. ఉప్పల్ మండే మార్కెట్ శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం.మరియుఉప్పల్ బురుజు ప్రసన్న ఆంజనేయ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆశిస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పైయి ఉండాలని పరమేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడు భక్తి, బలం, ధైర్యం, సేవాభావానికి ప్రతీకగా భావించబడుతాడు. అని హనుమంతుడు శ్రీరాముడికి పరమ భక్తుడు. ఆయన జీవితం మనకు నిజాయితీ, వినయం, గురుభక్తి, ధైర్యం వంటి మంచి గుణాలను నేర్పుతుంది. హనుమాన్ జయంతి సందర్భంగా , భక్తులతో ప్రత్యేక పూజలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు పోలే పాక అంజయ్య, టెంపుల్ ధర్మకర్తలు జ్యోతి అనిల్ గుప్తా ,ఉదయ్ కిరణ్ నల్గొండ సమ్మయ్య ,నవీన్ గౌడ్, ఎల్లవ్వ , శ్రీనివాస్ ముదిరాజ్ శ్రావణ్ గౌడ్ వెంకటేష్ మల్లికార్జున్,సురేష్ గౌడ్ , రాజేష్,సూరి, శ్రీకాంత్, జానీ ,హర్ష రెడ్డి ,ఆకాష్ ,గణేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామంతపూర్ డివిజన్ ఆలయ కమిటీ సభ్యులు, రాజమౌళి, పెంటయ్య, యాదగిరిరెడ్డి, ఉదయ్ దేశాయ్, జంగారెడ్డి, రాజమల్లు, చౌదరి.డివిజన్ అధ్యక్షుడు రఫిక్,ఉపేందర్ రెడ్డి, జలీల్ పాషా, శ్రీకాంత్ యాదవ్, అరుణ్ పటేల్,గరిక సుధార్, రాజీ రెడ్డి, షాగ శ్రీధర్,భాస్కర్. భాస్కర్ గంగా పుత్ర,సత్తిరెడ్డి, సత్తన్న,సతీష్ గౌడ్, ముత్యాల జంగయ్య, ముతయాల బాబు,సీమకండ్ల జంగయ్య,అశోక్,రవి, సలీంనాగమల్లయ్య, కిషోర్, స్వామి,కాశమల్ల శంకర్, విశాల్,గౌతమ్, కిరణ్, హరీష్ రెడ్డి,అంబిక,శ్రీనివాస్ గౌడ్.. ఉప్పల్ డివిజన్ బజార్ నవీన్, రాహుల్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డిప్యూటీ కమిషనర్ రాకతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం ......

## సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

## అనుమతులు లేకుండా నిర్మించిన +౦5 భవనాన్ని కూల్చివేసిన అధికారులు











**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణి కరన్ రాకతో పట్టణ ప్రణాళిక విభాగంలో కొత్త మార్పులు దుండిగల్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది గత కొంతకాలం నుండి దుండిగల్ సర్కిల్లో అక్రమ నిర్మాణాలపై అవినీతి ఆరోపణలపై, విమర్శలు ఎదుర్కొంటున్న టౌన్ ప్లానింగ్ యంత్రాంగం, నూతనంగా డిప్యూటీ కమిషనర్ బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ ఎస్ వెంకట మణి కరణ్ అక్రమ నిర్మాణాలపై వరుస చర్యలు చేపడుతూ అధికారుల యంత్రాంగంలో ఉత్సాహాన్ని తీసుకొస్తూ ఆయన పనితీరుపై ప్రజలనుండి విశ్లేషణ స్పందన పొందుతున్నారు.

**వరుసగా అక్రమ నిర్మాణాలు సీజ్**

గత రెండు రోజుల క్రితం బహదూర్ పల్లి టెక్ మహేంద్ర వెనుక అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. అలాగే దుండిగల్ విశ్వ సాయి టౌన్షిప్ సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డుపై కూడా చర్యలు తీసుకున్నారు, అదేవిధంగా బౌరంపేట్ లోని ఫాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణ పనులను నిలిపివేసి భవనాన్ని సీజ్ చేయడం జరిగింది.

**టెక్ మహేంద్ర ఎదురుగా ఉన్న భారీ భవనాన్ని కూల్చివేసిన అధికారులు**

సర్కిల్ పరిధిలోని పర్మిషన్ లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి బాదురుపల్లి లోని టెక్ మహీంద్రా ఎదురుగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్న +౦5 భవనాన్ని డిమాలిష్ చేయడం జరిగింది.

**కఠిన చర్యలు దిశగా కొత్త డిప్యూటీ కమిషనర్....**

ఫిబ్రవరి నెలలో సీజైన నిర్మాణాల సమయంలో ఉన్న డిప్యూటీ కమిషనర్ స్థానంలో ప్రస్తుతం కొత్తగా డాక్టర్ ఎస్ వెంకట మణి కరన్ డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాకతో మొదటిసారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ భవనాలను సీజ్ చేయడం జరిగింది. అయితే గతంలో మాదిరిగా నామ్ కి వాస్తేగా కాకుండా పక్క ప్రణాళికతో చర్యలు తీసుకునే విధంగా సీజ్ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతున్నారు. ఎట్టి పరిస్థితులలో అక్రమ నిర్మాణాలను ఉపయోగించకుండా, ఆ విధంగా చర్యలు తీసుకునే విషయంలో వెనకడుగు వేయకుండా కొత్త డిప్యూటీ కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు అక్కడి ఉన్న స్థానికులు.

**కొత్త డిప్యూటీ కమిషనర్ రాకతో ప్రజలలో నమ్మకం**

గత అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన చర్యలు తీసుకునే వారే కాదు అని ప్రజల నుండి విమర్శలు ఉండేవి అయితే ప్రస్తుతం వరుస తనిఖీలు సీజ్ చర్యలతో అక్రమ నిర్మాణదారులలో భయం నెలకొంది అనుమతులు లేకుండా నిర్మాణాలుచేపడితే కఠిన చర్యలు తప్పవని అక్రమార్కులకు హెచ్చరిక జారీ చేశారు. భవన నిర్మాణాల అనుమతులలో డి సి కఠిన వైఖరి అవలంబించడం ప్రజలలో విశ్వాసాన్ని పెంచుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సెంట్రింగ్ పని బంద్ గోడ పత్రికను ఆవిష్కరించిన కె.యం.ప్రతాప్ ....



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారు తేదీ 16-5-2026 రోజు నుండి సమస్యల సాధన కోసం నిర్వహించబోయే సెంట్రింగ్ పని బంద్ గోడ పత్రికను రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ చేతుల మీదగా కుత్బుల్లాపూర్ గ్రామంలోని సిపిఆర్ కాలనీలో గల తన నివాసంలో ఆవిష్కరింపజేశారు. ధరల పెంపు కోసం శాంతియుతంగా బంద్ పాటించే సమయాల్లో మాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం పోరాడుతానన్నారు వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు మరియు సెంట్రింగ్ కార్మికులు తమ సమస్యల సాధన కొరకు చేపడుతున్నటువంటి సెంట్రింగ్ పని బంద్ కార్యక్రమానికి తన పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్టు తెలియజేశారు. మన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల, సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నానన్నారు, కార్మికులకు తగిన న్యాయం చేసి, కార్మిక సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో, జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి. శ్రీనివాస్, ఎన్ అశోక్, సలహాదారులు బి.వెంకటేశ్వరరావు, వి. ఇంద్రసేనారెడ్డి, పి.నరసింహ రెడ్డి, టి.నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ కుంట వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ సి హెచ్. సత్తిబాబు,జనరల్ సెక్రెటరీ జీ.ప్రవీణ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ వి.రాకేష్, కోశాధికారి టి. శివశంకర్ పి. శ్రీనివాస్, ఆర్గనైజర్లు : ఈశ్వర్, కృష్ణ, మహంకాళిరావు, సత్యనారాయణ, ముని, సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ దేవాలయాల్లో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొన్నబి బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ...





**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** మంగళవారం 132 – జీడిమెట్ల డివిజన్ల లోని వివిధ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల కార్యక్రమానికి బి ఆర్ ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పరాక్రమశాలి హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా...

**ప్రసన్న నగర్ కోదండ రామాలయంలో ....**

ప్రసన్న నగర్ కోదండ రామాలయంలో నిర్వహించిన దేవాలయ వార్షికోత్సవ మరియు హనుమాన్ జయంతి వేడుకలల్లో పాల్గొన్న బిఆర్ ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సిద్ధులు గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, సభ్యులు నాగచంద్రారెడ్డి, నాగార్జున, నారాయణ, దేవాలయ కమిటీ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి మారయ్య బాబు మారయ్య బాబు, ముఖ్య సలహాదారులు నాగేంద్ర బాబు తదితరులు పాల్గొనగా....

**ఎం.ఎన్.రెడ్డి నగర్ లో.....**

ఎమ్ రెడ్డి నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పవన సుత హనుమాన్కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్నే శ్యామ్, సభ్యులు ఎలా గౌడ్, విటల్ నాయక్, బాలచందర్, సత్యనారాయణ, కుమార్, రాహుల్, నరేష్, సందీప్, కిరణ్ తదితరులు పాల్గొనగా...

**కుత్బుల్లాపూర్ వేణుగోపాల స్వామి దేవాలయంలో ...**

కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై రామ భక్త హనుమాన్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో

ఆలయ కమిటీ అధ్యక్షులు జిట్టా రామేశ్వర్ రెడ్డి, సభ్యులు కమలాకర్ గౌడ్, కుల్ఫీ వెంకటేష్, కుంటా వేణు, సుధాకర్ గౌడ్, నల్ల ప్రసాద్, బలవంత రెడ్డి, నల్ల వేణు, కిరణ్ గౌడ్, అంజి పాల్గొనగా... ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## మంచి పరిపాలన అంటే ప్రజలపై భారాలు మోపడమా?




**హైదరాబాద్:వాస్తవ తెలంగాణ** మంచి పరిపాలన అందించటమంటే ప్రజలపై భారాలు మోపడమేనా? అని ప్రధాని మోడీ ప్రసంగంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధానొస్తే ఎంతో లాభం జరుగుతుందని ప్రజలంతా భావించారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ కు పోయిగౌరవ ప్రదంగా స్వాగతం పలికామని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం కూడా పాల్గొన్నారని తెలిపారు. కానీ..పీఎం మాత్రం పెట్రోల్ డీజిల్ వాడొద్దు..బంగారం కొనొద్దు , వంట నూనె వాడొద్దు అంటూ సుభాషితాలు వల్లించారని విమర్శించారు. ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వేలాది కార్ల తో రోడ్ షో చేశారని చెప్పారు. ప్రజలకు బరోసా కల్పించాల్సింది పోయి భయబ్రాంతులకు గురి చేశారని తెలిపారు. మోడీ, అమిత్ షా, నడ్డా,బండి సంజరు,కిషన్ రెడ్డి, కాళేశ్వరం లో అవినీతి జరిగింది..బీఆర్ఎస్‌కు ఎటిఎంగా ఉంది, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశిస్తే ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ కు 12 ఏండ్లలో ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులెన్ని, రాష్ట్ర వాటా ఎంత? అనేదానిపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. పక్క రాష్ట్రం వాళ్ళు ఎన్ని నిధులు అడుగుతే అన్ని తీసుకుపోతున్నారనీ, రాష్ట్ర బీజేపీ నేతలు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని నిలదీశారు. ప్రధాన మంత్రి తో సహా కేంద్ర మంత్రులను రాష్ట్రానికి కావాల్సిన అంశాలు అడుగుతుంటే వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## తాడు దాన్ పల్లి లో కేబుల్ దొంగకు దేహశుద్ధి మరో ముగ్గురు దొంగలు పరారీ



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి మే 12** పట్టపగలు కేబుల్ వైర్లను దొంగలిస్తూ పట్టుబడ్డ ఓ వ్యక్తి కి దేహశుద్ధి చేసిన సంఘటన చౌటుకూరు మండలం తాడు దాన్ పల్లి గ్రామం లో మంగళవారం జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బస్వాపూర్ గ్రామానికి చెందిన వడ్డే పుల్లయ్య తో పాటు చిలిపి చెడే మండలం చందూరు చెందిన రవి శివ కౌడిపల్లి మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన కుమార్ గత కొన్ని రోజుల క్రితం వ్యవసాయ పొలాల వద్ద బోర్ల మోటార్లకు కేబుల్ కాపర్ వైర్లను ఎత్తుకు వెళ్తున్నారు ఈ క్రమంలో మంగళవారం పట్టపగలు పైన పేర్కొన్న వ్యక్తులు గ్రామ శివారులోని సుశ్రుత్ ఫార్మసీ కళాశాలలో ఎవరూ లేరనుకొని బోర్ మోటార్లకు మరిచిన కేబుల్ కాపర్ వైర్ ను కట్ చేశారు కేబుల్ వైర్ ను కట్ చేసి పహారి గోడ దుంకి పారిపోయేందుకు యత్నించగా ఇందులో పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వడ్డే పుల్లయ్య దొరికిపోయారు మిగిలిన ముగ్గురు దొంగలు తప్పించుకొని పారిపోయారు ఈ సంఘటన విషయాన్ని గ్రామంలోని యువకులు రైతులకు సమాచారం అందించడంతో కాపర్ వైర్ ను పుల్లయ్యను వెంటబెట్టుకొని గ్రామంలోకి తీసుకెళ్లారు ఇట్టి విషయం తెలుసుకున్న రైతులు గ్రామస్తులు యువకులు జయసిద్ధి చేశారు అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వడ్డే పుల్లయ్య ను అదుపులోకి తీసుకొని పుల్కల్ పోలీస్ స్టేషన్ కు తరలించారుయి కాగా పరారైన వారి పేర్లను సెల్ ఫోన్ నెంబర్లను తెలియజేశారు పరారైన వారి జాడ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు..

# నేడు కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ కీలక సమావేశం

**హైదరాబాద్ :వాస్తవ తెలంగాణ** నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం జరగనుంది. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో కేటీఆర్, హరీష్ రావు, శాసనసభ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, కీలక నేతలు పాల్గొంటారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, పార్టీ ఇన్చార్జిల నియామకం, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. లంచ్ అనంతరం ఈ సమావేశం ప్రారంభం కానుంది.



## నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత కేంద్రానిదే: కేటీఆర్

**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దుచేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ మేరకు తాజాగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. “2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైంది. జాతీయ అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థుల పట్ల శాపంగా మారింది. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ కావడం వ్యవస్థలో ఉన్న దారుణమైన లోపాలను బయటపెట్టింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్ గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలి. దీని వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలి.” అని ఎక్స్ పోస్ట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

